సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



పార్క్ చేసిన వాహనాలే టార్గెట్

జిల్లాలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన పది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో



194 అర్జీల స్వీకరణ

జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జేసీ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. 8లో



త్వరితగతిన రోడ్ల అభివృద్ధి

నగరంలో జరుగుతున్న రహదారుల పనులు సత్వరం పూర్తి చెయ్యాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశించారు. 8లో

నెట్‌వర్క్.. పర్‌ఫెక్ట్

- విశాఖ సర్కిల్ పరిధిలో నెట్‌వర్క్‌ను సమగ్రాభివృద్ధి చేస్తున్న ఈపీడీసీఎల్
- హుద్‌హుద్ సమయంలో విశాఖలో 70 శాతం దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ
- రూ.400 కోట్లు ఖర్చు చేసి కేవలం తాత్కాలిక పనులు నిర్వహించిన టీడీపీ ప్రభుత్వం
- హడావుడిగా లైన్ల పునరుద్ధరణతో తరచూ సరఫరాకు ఇబ్బందులు
- మూడేళ్లుగా ఒక్కో ప్రాంతం నెట్‌వర్క్‌ను సరిదిద్దుతూ శాశ్వత పరిష్కార పనులు



కొత్తగా స్తంభం ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

ప్రమాదాలు తగ్గాయిలా..

సంవత్సరం	జరిగిన ప్రమాదాలు
2017-18	68
2018-19	46
2019-20	24
2020-21	44
2021-22	33
2022-23	37
2023-24	18



పోల్స్ మార్చుతున్న విద్యుత్ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం : సాధారణంగా అమెరికాలో తుపాను కారణంగా విద్యుత్ వ్యవస్థ దెబ్బతింటే 15 రోజుల సమయమైనా తీసుకొని శాశ్వత పనులు నిర్వహిస్తారు. కానీ హుద్‌హుద్ సమయంలో అప్పటి సీఎం చంద్రబాబు ప్రచార ఆర్భాటంతో ముందుచూపు లేకుండా వారం రోజుల్లోనే విద్యుత్ పునరుద్ధరించాలంటూ రూ.400 కోట్లతో చేపట్టిన తాత్కాలిక పనులతో ఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది. ఈ క్రమంలో అనేక ప్రమాదాలు కూడా ప్రజల జీవితాల్ని ఛిన్నాభిన్నం చేసేశాయి. టీడీపీ చేసిన హడావుడి తప్పిదాల్ని సరిదిద్దుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రక్షాళన దిశగా చర్యలకు ఉపక్రమించింది. మూడేళ్లుగా ఒక్కో ప్రాంత నెట్‌వర్క్‌ను సరిచేస్తూ విశాఖ సర్కిల్ పరిధిలో శాశ్వత పరిష్కార పనులను నిర్వహిస్తోంది.

హడావుడిగా లైన్ల పునరుద్ధరణతో..

హుద్‌హుద్ విపత్తు కారణంగా విశాఖ సర్కిల్ పరిధిలో దాదాపు 40 వేల వరకూ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 44 సబ్‌స్టేషన్లు ధ్వంసమయ్యాయి. మొత్తంగా 70 శాతానికి పైగా విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది. మొత్తం రూ.120 కోట్లు వరకూ నష్టం వాటిల్లింది. విద్యుత్ వైర్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్పు కోసం దాదాపు రూ.600 కోట్లు ఖర్చు చేశారు. వేలమంది కాంట్రాక్టు కూలీలతో స్తంభాల మార్పు పనులు చేపట్టారు. తాత్కాలిక పనులు చేసి సరఫరా ఇవ్వాలంటూ అధికారులకు చంద్రబాబు హుకుం జారీ చేయడంతో యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. స్తంభాల ఏర్పాటు కూడా హడావిడిగా చేశారు. సాధారణంగా ఒక పోల్‌ని నిలబెట్టేటప్పుడు పోల్‌లో 1/6వ వంతు భూమిలోపల ఉండేలా చూసుకోవాలి. అదేవిధంగా ప్రతి 10వ పోల్, కర్వ్‌డ్ ఏరియాలోనూ ఆ పోల్‌ని కాంక్రీట్‌తో కప్పాలి. ఇవేమీ చేయకుండానే పనులు నిర్వహించేశారు. ఈ కారణంగా విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది.

ప్రాణాలు తీసిన టీడీపీ ప్రచార ఆర్భాటం

తాత్కాలిక పనులు చేపట్టిన తర్వాత టీడీపీ ప్రభుత్వం వాటి స్థానంలో శాశ్వత పనులు చేపట్టాలన్న అంశాన్ని గాలికొదిలేసింది. దీంతో క్రమంగా విద్యుత్ సరఫరాలో లోపాలు తలెత్తడం మొదలైంది. సరైన పట్టు లేకపోవడంతో చిన్న గాలికే స్తంభాలు నేలకొరిగిపోవడం, మరికొన్ని చోట్ల పడిపోవడం, ఇంకొన్ని చోట్ల పాత స్తంభాల్ని పాతడంతో అవి విరిగిపోవడం.. వంటి ప్రమాదాలు సంభవించాయి. దీని కారణంగా సామాన్య ప్రజలు సైతం ప్రాణాలు కోల్పోవడం వంటి విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. 2017-18లో 68 ప్రమాదాలు సంభవించగా, 2018-19లో 46 ప్రమాదాలు జరిగాయి. ఇవన్నీ టీడీపీ ప్రచార ఆర్భాటం కారణంగానే జరిగినవే. అలాగే హుద్‌హుద్ తుపాను అనంతరం చేపట్టిన విద్యుత్ పునరుద్ధరణ పనుల మాటున టీడీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలను పక్కదోవ పట్టించిందనే ఆరోపణలు ఉన్నాయి.

తప్పిదాల్ని సరిదిద్దుతూ...

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ వ్యవస్థ ప్రక్షాళన దిశగా అడుగులు వేసింది. విశాఖలో జరుగుతున్న ప్రమాదాలు, తలెత్తుతున్న అంతరాయాలపై దృష్టిసారించాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్పెషల్ సీఎస్ విజయానంద్ ఆధ్వర్యంలో సీఎండీల నుంచి డిప్యూటీ ఈఈల వరకూ క్షేత్రస్థాయి సమావేశాలు నిర్వహించగా.. వీటన్నింటికీ కారణం.. హుద్‌హుద్ సమయంలో చేసిన తప్పిదాలని గుర్తించారు. వీలైనంత త్వరగా పునరుద్ధరణ పనులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి విశాఖ సర్కిల్ పరిధిలో పనులు జోరందుకున్నాయి. ఒక్కో స్తంభాన్ని, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చుకుంటూ శాశ్వత పనులు చేపడుతూ సరఫరా వ్యవస్థని బలోపేతం చేస్తున్నారు. ఈ కారణంగా ప్రమాదాలు తగ్గుతూ వస్తున్నాయి. 2019-20లో కేవలం 24 ప్రమాదాలు మాత్రమే జరిగాయి. 2021-22లో 33, 2023-24లో 18 ప్రమాదాలు మాత్రమే సంభవించాయి. ఇప్పటివరకు 20 వేలకు పైగా స్తంభాల్ని మార్చారు.

ఇప్పటివరకు 33కేవీ, 11కేవీ విద్యుత్ వ్యవస్థ పరిధిలో చేపట్టిన శాశ్వత పనులు

దెబ్బతిన్న పోల్స్ స్థానంలో వేసిన కొత్త పోల్స్	8,086
నేలకొరిగిన పోల్స్ స్థానంలో వేసిన కొత్త పోల్స్	7661
చిన్న పోల్స్ స్థానంలో కొత్త వేసిన కొత్త పోల్స్	1597
పోల్స్ మధ్య దూరం ఉంటే వాటి మధ్యలో వేసిన కొత్త స్తంభాలు	3,336
రోడ్ క్రాసింగ్స్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన హైట్ పోల్స్	1312
సపోర్ట్ వైర్లు ఏర్పాటు చేసిన చేసిన ప్రాంతాలు	11,331
కొత్తగా ఏర్పాటు చేసిన కండక్టర్లు	867 కిలోమీటర్లు
ప్రమాదాలు జరగకుండా గార్డులు ఏర్పాటు చేసిన ప్రాంతాలు	1271
ఇప్పటివరకు ఖర్చు చేసిన మొత్తం నిధులు	రూ.68.50 కోట్లు

సరఫరాలో నాణ్యత పెరిగింది



ఈపీడీసీఎల్‌లోని విశాఖ సర్కిల్ పరిధిలో విద్యుత్ నెట్‌వర్క్‌ను దశల వారీగా పునరుద్ధరిస్తున్నాం. 20 వేలకు పైగా కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశాం. కొత్త కండక్టర్లను అమర్చాం. 33 కేవీ, 11 కేవీ లైన్లు ఇప్పటికే చాలా మార్పు చేశాం. ఫలితంగా సరఫరాలో నాణ్యత పెరిగింది. అంతరాయాలు దాదాపు తగ్గుముఖం పట్టాయి. ప్రాంతాల వారీగా పనులు నిర్వహిస్తున్నాం. అందుకే విద్యుత్ సరఫరా గణనకు సంబంధించిన సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ డ్యూరేషన్ ఇండెక్స్(సైదీ), సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్(సైఫీ)లో నంబర్‌వన్‌గా నిలుస్తూ వస్తున్నాం. 2014-19 మధ్య కాలంతో పోల్చితే సర్కిల్ పరిధిలో వినూత్న మార్పులు చోటుచేసుకున్నాయి. ఆ కాలంలో రోజుకు సగటున 60 నుంచి 85 నిమిషాల వరకు విద్యుత్ అంతరాయం ఉండేది. ఇప్పుడు కేవలం 4 నుంచి 10 నిమిషాలు మాత్రమే పవర్ కట్ అవుతోంది.

– పృథ్వీతేజ్ ఇమ్మడి,ఏపీఈపీడీసీఎల్ సీఎండీ

దశల వారీగా పనులు పూర్తి చేస్తాం



హుద్‌హుద్ కారణంగా చాలా వ్యవస్థ దెబ్బతింది. ఇప్పుడు ప్రతి ప్రాంతంలోనూ పునరుద్ధరణ పనులు చేపడుతున్నాం. అత్యంత ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో ముందుగా పనులు నిర్వహిస్తున్నాం. ప్రమాదాలు కూడా ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. బ్రేక్‌డౌన్స్ తగ్గాయి. గతంలో చిన్నగాలి వీచినా సరఫరా ఆగిపోయేది. ఇప్పుడు చాలాచోట్ల వర్షాలు పడినా సరఫరా ఇస్తున్నాం. ఇదే సమయంలో విపత్తుల కారణంగా ఏదైనా అవాంతరాలు ఎదురైనా.. వెంటనే పరిష్కరించేందుకు కొత్త సాంకేతికతని అనుసరిస్తున్నాం. రూరల్ మండలాల్లో వ్యవసాయానికి పగటిపూట కూడా విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నాం. సర్కిల్ పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాల్లోనూ స్తంభాలు, కండక్టర్లు మార్పులు దశలవారీగా వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం.

– ఎల్.మహేంద్రనాథ్, ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ

న్యూస్‌రీల్

ఎన్నికల సమాచారంతో సిద్ధంగా ఉండండి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, ఇతర అధికారులు

మహారాణిపేట: ఎన్నికల సమాచారంతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 22, 23 తేదీల్లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధుల బృందం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనుందని, విజయవాడలో జరిగే ఈ సమావేశానికి సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు. సోమవారం సాయంత్రం వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సన్నద్ధత సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్‌వో కె.మోహన్ కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శారదా పీఠంలో సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హారతి అందజేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

పెందుర్తి : విశాఖ శ్రీ శారదా పీఠంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున భక్తులు పీఠానికి తరలివచ్చారు. సంప్రదాయం ప్రకారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రీతికరమైన పాలకావిడిని ఊరేగించారు. అనంతరం పీఠంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అభిషేకం నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తన స్వామికి హారతులిచ్చి పూజలు నిర్వహించారు. అలాగే వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

గోపాలపట్నం: రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దవుతుందని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపిన వారిపై కేసు నమోదు చేసి డ్రైవింగ్ లైసెన్స్‌ను 3 నుంచి 6 నెలల వరకు సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. రహదారి భద్రతపై ఏర్పాటు చేసిన సుప్రీం కోర్టు కమిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మోటారు వాహనాల చట్టం సెక్షన్ 206 ప్రకారం మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనాన్ని నడిపినా, ప్రమాదాలకు కారణమైనా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. 2022లో 1,140 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశామని తెలిపారు.

కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌కు ఎస్ కోటలో హాల్ట్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇచ్చిన హామీ మేరకు కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌కు శృంగవరపుకోటలో హాల్ట్‌ను కేటాయించేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. ఈ రైలు ఇరువైపులా రెండు నిమిషాలు ఎస్ కోటలో ఆగుతుంది. ఈ నెల 19వ తేదీ నుంచి విశాఖపట్నం-కిరండూల్(18514)నైట్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు రాత్రి 10.08 గంటలకు ఎస్ కోట చేరుకుని అక్కడ నుంచి 10.10 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 19వ తేదీన కిరండూల్-విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఎస్ కోటకు మధ్యరాత్రి(20వ తేదీ) 12.50 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 12.52 గంటలకు బయల్దేరుతుంది.

నేటి నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

మురళీనగర్: ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని సమన్వయాధికారి, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో ఉదయం 10 గంటలకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఇతర ప్రముఖులు పాల్గొంటారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులు పాల్గొంటారు.

పార్టీ వ్యవస్థాపకునికి ఇచ్చే విలువ ఇదేనా..

- ఎన్టీఆర్ విగ్రహాన్ని విస్మరించిన లోకేష్
- పైలాన్ పక్కనే ఉన్నా పట్టించుకోని వైనం



పైలాన్ సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం

అగనంపూడి: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌ను మరోసారి విస్మరించారు మనవడు లోకేష్. యువగళం ముగింపు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించిన అనంతరం అక్కడ ఫొటోలు, సెల్ఫీలతో గంటసేపు గడిపిన లోకేష్‌కు తాత ఎన్టీఆర్ విగ్రహం మాత్రం కనిపించలేదు. ఇదంతా చూసిన కార్యకర్తలు ఇదేమి విడ్డూరమని వాపోయారు. వివరాల్లోకి వెళ్తే.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం ముగింపు కార్యక్రమం సోమవారం సాయంత్రం అగనంపూడి టోల్‌గేటు సమీపంలో ఏర్పాటు చేశారు. పైలాన్ ఏర్పాటుతోపాటు ముగింపు కార్యక్రమం అక్కడితో పరిసమాప్తం చేశారు. అయితే గతంలో చంద్రబాబు నాయుడు పాదయాత్ర ముగింపు సమయంలో ఏర్పాటు చేసిన పైలాన్ పక్కనే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేశారు. వాటికి ఎడమవైపున లోకేష్ పాదయాత్ర ముగింపు పైలాన్‌ను కూడా ఏర్పాటు చేశారు. పది మీటర్ల దూరంలో ఉన్న తాత ఎన్టీఆర్ విగ్రహానికి ముందుగా నివాళులర్పిద్దామనే ఆలోచన లోకేష్‌కు లేకుండాపోయింది. పైలాన్ ప్రారంభోత్సవం చేసిన తరువాత నాయకులు, కార్యకర్తలు, మహిళలతో ఫొటోలు దిగుతూ సెల్ఫీలకే పరిమితం చేశారు. అక్కడ నుంచి వెళ్లే ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేయడంతో పార్టీ అభిమానులు, కార్యకర్తలే ఇదేమిటని వాపోయారు.

రోడ్డును ఆక్రమించి ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు



రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన విగ్రహం

గాజువాక : అనుమతి లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేయరాదన్న నిబంధనను టీడీపీ నాయకులు పెడచెవిన పెట్టారు. రోడ్డును ఆక్రమించి మరీ దివంగత నేత ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. కణితి రోడ్‌లోని చినగంట్యాడ సమీపంలో 72వ వార్డుకు చెందిన ఒక నాయకుడు రోడ్డును ఆక్రమించి విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. రాత్రికి రాత్రే ఒక దిమ్మను నిర్మించి దానిపై అప్పటికప్పుడు విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. యువగళం కార్యక్రమంలో భాగంగా పాదయాత్రగా గాజువాక చేరుకున్న లోకేష్ ఆ రోడ్డులోకి రాగానే ఆ విగ్రహాన్ని ఆవిష్కరించాలని కోరాడు. షెడ్యూల్‌లో విగ్రహావిష్కరణ లేకపోవడంతో లోకేష్ తిరస్కరించి ముందుకు సాగాడు. దీంతో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆ విగ్రహాన్ని ఆవిష్కరించాడు.

పోలీసులు, పరిశ్రమలకు అనుసంధానంగా వీసీఎస్‌సీ



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

విశాఖ సిటీ: పోలీసులకు, పరిశ్రమలకు విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(వీసీఎస్‌సీ) అనుసంధాన సంస్థగా ఉంటూ పారిశ్రామిక, మహిళల, రహదారి భద్రతను మెరుగుపర్చడంలో పోలీస్ శాఖతో భాగస్వామిగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పిలుపునిచ్చారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో వివిధ పరిశ్రమలు, సంస్థలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజా భద్రతా చర్యలను మెరుగుపర్చడానికి తీసుకున్న చర్యలు, నగర పోలీసులు అమలు చేస్తున్న కొత్త స్మార్ట్ పోలీసింగ్ కార్యక్రమాలను వివరించారు. ప్రమాదాల నివారణకు, ప్రాణాలను రక్షించడానికి నగరం, చుట్టుపక్కలు గుర్తించిన స్ట్రెచ్‌లలో రహదారి భద్రతను మెరుగుపర్చడానికి పోలీసులతో భాగస్వామిగా ఉండే విషయంపై పరిశ్రమల మద్దతు కోరారు. ఈ సందర్భంగా విశాఖ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ www.vizafrecuritycounci.orf కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. పోలీసులకు వివిధ కార్యకలాపాలకు మద్దతు తెలపడంతో పాటు స్వచ్ఛంద సేవకులుగా ఈ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, వీసీఎస్‌సీ కార్యదర్శి ఎ.కృష్ణబాలాజీ, ఆఫీస్ బేరర్లు ధీరజ్, నారాయణ, లక్ష్మీ మొక్కవిల్లి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

క్రిమినల్స్‌ను ప్రోత్సహిస్తున్న పవన్

- ఇందుకు నిదర్శనం జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్
- బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తూ పాలనకు విఘాతం కలిగిస్తున్నారు
- జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



మాట్లాడుతున్న ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

డాబాగార్డెన్స్: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్.. పీతల మూర్తియాదవ్ అనే క్రిమినల్‌ను ప్రోత్సహించడం చూస్తుంటే.. ఆ పార్టీ నాయకుడు కూడా క్రిమినల్‌గానే భావించాల్సి వస్తుందని జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆరోపించారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పెద్ద 420 అని విమర్శించారు. ఎప్పటికప్పుడు మీడియా సమావేశాలు నిర్వహించి బ్లాక్ మెయిల్ రాజకీయం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ధ్వజమెత్తారు. జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఓ వ్యక్తికి చెందిన పీతలవానిపాలెంలో 2,200 గజాల స్థలాన్ని ఆక్రమించుకొని తన తండ్రి పీతల శ్రీరాములు పేరిట కోర్టులో కేసు వేయించాడని, అన్ని ఆధారాలు, పక్కా డాక్యుమెంట్స్‌తో ఆ స్థల యజమాని గెలుచుకున్నాడని తెలిపారు. ఈ విషయమై పీతల మూర్తియాదవ్ తండ్రి శ్రీరాముల్ని అడిగితే తనకు ఏమీ తెలీయదు.. తన కుమారుడు కోర్టులో కేసు వేయమంటే వేశానని చెప్పాడంటే అతడి నైజం ఏంటో తెలుస్తుందన్నారు. ఇదిలా ఉండగా పీతల మూర్తి సోదరి పీతల ఉమారాణి కూడా ఆనందపురంలో ఓ ఇంటిని వాటర్‌ప్లాంట్ కోసం అద్దెకు తీసుకొని సక్రమంగా అద్దె చెల్లించక పోగా ఆ ఇంటి యజమానిపై కోర్టులో కేసు వేశారన్నారు. అయితే అన్ని ఆధారాలతో ఆ ఇంటి యజమాని కోర్టులో కేసు గెలుచుకున్నాడని.. అంటే మూర్తియాదవ్ కుటుంబమే ఓ క్రిమినల్ స్వభావం కలిగి ఉందని ఆరోపించారు.

అభివృద్ధికి అడ్డంకిగా..

నగరాభివృద్ధి విషయానికొస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జీవీఎంసీ నేతృత్వంలో నగరంలో ఎక్కడికక్కడ రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతుంటే పీతల మూర్తియాదవ్ పనిపాటు లేక ఏవేవో ఆరోపణలు చేస్తూ అడ్డుతగులుతుండడం సిగ్గుచేటన్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు ఇస్తున్నా ఓర్చుకోలేకపోతున్నాడని దుయ్యబట్టారు. పీతల మూర్తి వంటి వ్యక్తిని పవన్‌కల్యాణ్ ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. పీతల మూర్తిపై ఇప్పటికే ఎన్నో ఫిర్యాదుల్ని బాధితులు తమ దృష్టికి తీసుకొచ్చారని, మరికొద్ది రోజుల్లో అతడి అరాచకాల నిగ్గుతేలుస్తామన్నారు. విశాఖను గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతుంటే సహకరించకపోగా నగరాభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నంలో అతడు ఉన్నాడని ఎద్దేవా చేశారు. అంతేగాక అధికారులను మభ్యపెట్టి పీతల మూర్తి పబ్బం గడుపుకుంటూ సంపాదనలో పడ్డాడన్నారు. మూర్తిపై అనేక పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయన్నారు. గతంలో అతడిని కాంగ్రెస్, వైఎస్సార్ సీపీ సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని లేదంటే తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

ఏపీలో వైద్యరంగ సంస్కరణలు దేశానికే ఆదర్శం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితి పెంపు హర్షణీయం



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, వాసుపల్లి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న వైద్యరంగ సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు వ్యయ పరిమితి పెంపు, ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్, కొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ప్రారంభించారు. విశాఖ కలెక్టరేట్ నుంచి స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి, ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితి పెంపు వైద్య రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని, ఈ నిర్ణయం హర్షణీయమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని జనవరి ఒకటో తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ మల్లికార్జున..రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి వివరించారు.

మొదటి విడత భారీ స్పందన

జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడతలో 2,10,000 మంది రిజిస్టర్ కాగా అందులో 850 మందిని వివిధ ఆస్పత్రులకు పంపగా, ఐదుగురికి శస్త్ర చికిత్సలు కూడా నిర్వహించినట్లు కలెక్టర్ వివరించారు. సంక్రాంతిలోపు సరఫరా కానున్న కళ్లజోళ్లను కూడా పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో మాదిరిగా ప్రతి ఆరోగ్య శిబిరానికి ఇద్దరు వైద్యాధికారులతో పాటు ఇతర వైద్య సిబ్బందిని కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు.

కరపత్రాల పంపిణీ

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం పొందడం ఎలా? అవగాహన కల్పిస్తూ ముద్రించిన కరపత్రాలు 6 లక్షలు జిల్లాకు వచ్చాయని, అలాగే ఆడియో విజువల్స్ కూడా చేరాయని, వాటిని ఎ.ఎన్.ఎం, ఆశా, మహిళా పోలీసుల ద్వారా ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వీటితోపాటు ఆరోగ్యశ్రీ, దిశా యాప్‌లు డౌన్ లోడ్ చేసుకోవడం, వాటిని లబ్ధిదారులు వినియోగించుకునేలా అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాకు 25 వేల స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయని, వాటిని నియోజకవర్గానికి ఐదేసి గ్రామాల్లో పంపిణీ చేసి అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కేవీవీఎస్ఎన్ రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ టి.సత్య శ్రీనుబాబు, వైద్యాధికారులు, ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్స్ పాల్గొన్నారు.

త్వరితగతిన రోడ్లు, కూడళ్ల అభివృద్ధి


అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

సీతంపేట: జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న పలు రోడ్లు, కూడళ్ల విస్తరణ, అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చెయ్యాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జోన్ 5 పరిధిలోని అక్కయ్యపాలెం, గిరి ప్రదక్షిణ రోడ్డు, సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార రోడ్డులో జరుగుతున్న పనులను ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా దొండపర్తి జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం మీదుగా జాతీయ రహదారి వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ, కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, సెంటర్ మీడియన్, అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌వద్ద కూడలి అభివృద్ధి పనులను పరిశీలించి, పనులు మందకొడిగా సాగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేసి, ఈనెల31 నాటికి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న పలు విద్యుత్ స్తంభాలను మార్చి, అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చెయ్యాలని, ఆక్రమణలను వెంటనే తొలగించాలని పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్, ఏసీపీ రామకృష్ణను కమిషనర్ ఆదేశించారు. అనంతరం మద్రిపాలెం జంక్షన్ మారియట్ హోటల్ నుంచి మాధవధార, మురళీనగర్ మీదుగా సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు పలు చోట్ల రోడ్డు విస్తరణ, కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, అవసరమైన చోట సెంటర్ మీడియన్ అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చెయ్యాలని ఎస్ఈ వేణుగోపాల్‌ను కమిషనర్ ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుంచి సత్యం జంక్షన్‌వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు, ఏఎంవోహెచ్ డాక్టర్ సునీల్ కుమార్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పార్క్ చేసిన వాహనాలే టార్గెట్

- దొంగతనాలకు పాల్పడుతున్న పది మంది అరెస్ట్
- నిందితుల నుంచి రూ.6.10 లక్షల చోరీ సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ గంగాధరమ్ తదితరులు


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రికల్ సామగ్రి

అల్లిపురం: నగరంలో టూటౌన్, త్రీటౌన్, భీమిలీ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన పది మంది నిందితులను క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.6.10 లక్షల విలువ గల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రైం ఏడీసీపీ డి.గంగాధరమ్ వివరాలు వెల్లడించారు.

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

భూపేష్‌నగర్ ప్రాంతానికి చెందిన జోరిగల గణేష్ ఈ నెల 11వ తేదీ ఉదయం 11.45 గంటలకు కేరళ మసీదు వద్ద ఆటో నిలిపి ఇంటికి వెళ్లాడు. తిరిగి 3 గంటలకు వచ్చే సరికి తన ఆటో కనిపించలేదు. దీంతో గణేష్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే రోజు రాత్రి కొబ్బరితోట, చేపలబజారు ప్రాంతానికి చెందిన నాయిన శంకర్ తన ఆటోను కొబ్బరితోట, మనోరమాథియేటర్ వద్ద నిలిపాడు. 12వ తేదీ మధ్యాహ్నం 9 గంటల ప్రాంతంలో ఆటో కనిపించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసిన టూటౌన్ క్రైం పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని కంచరపాలెం, ఐటీఐ జంక్షన్ దరి అలుమూరి నాగరాజు అలియాస్ చంటిగా గుర్తించారు. అతనిని అదుపులోకి తీసుకుని, రెండు ఆటోలను స్వాధీనం చేసుకుని, నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు.

రైల్వే క్వార్టర్స్‌లో..

డీఆర్ఎం ఆఫీస్ దరి రైల్వే క్వార్టర్స్‌లో రైల్వే డిప్యూటీ సీఎస్‌వో మోహనీస్ బ్రహ్మ టైపు 5/4 క్వార్టర్స్‌లో తన కుటుంబంతో నివసిస్తున్నారు. అతనికి బదిలీ అయింది. బదిలీ అయిన ఊరికి వెళ్లారు. ఈ నెల 17వ తేదీన పనిమనిషి ఇల్లు క్లీన్ చేయడానికి వచ్చే సమయానికి ఇంటి తాళం విరగ్గొట్టి ఉందని మోహనీస్‌కు ఫోన్ చేసి చెప్పింది. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి చూడగా ఇంట్లో ఎం.ఐ. టీవీ, ఎయిర్ కండీషనర్ ఔట్ డోర్ యూనిట్లు రెండు, ఇండేన్ గ్యాస్ సిలిండర్, జీఐ సైకిల్ దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు రైల్వే స్టేషన్ వద్ద ఫుట్‌పాత్‌లపై ఉంటున్న బీసీరోడ్డు, గాజువాక ప్రాంతానికి చెందిన రౌడీ షీటర్ బుర్ర రామకృష్ణ, మహారాష్ట్ర, కపిలేశ్వర్ కాలనీకి చెందిన ఈశ్వర్ గోపాల్‌గా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని, సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

సాగర్‌నగర్ ప్రాంతానికి చెందిన తమ్మినేని ప్రసాద్ వాల్తేరు అప్‌లాండ్స్‌లో గత నెల 4వ తేదీన తన చేవ్రొలెట్ స్పార్క్ కారు పార్కు చేశాడు. 9వ తేదీన రాత్రి వచ్చి చూడగా కారు కనిపించలేదు. దీంతో బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన త్రీటౌన్ పోలీసులు కారును మధురవాడ , దుర్గా థియేటర్ వద్ద గల స్క్రాప్ షాపు వద్ద కారును కనుగొన్నారు. స్క్రాపు షాపు యజమానికి ప్రశ్నించగా వాల్తేర్ అప్‌లాండ్స్ ప్రాంతానికి చెందిన ఆబోతుల భోగేశ్వర్ కారును తనకు అమ్మినట్లుగా చెప్పడంతో స్క్రాపు షాపు యజమాని నాయన లక్ష్మణ్‌తో పాటు ఆబోతుల భోగేశ్వర్‌ను అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

భీమునిపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో..

టి.నగరపాలానికి చెందిన తమ్మిన ఆంజనేయులు దాకమర్రిలో వాటర్ సర్వీసింగ్ సెంటర్ నడుపుతున్నాడు. అతనికి ఆరోగ్యం బాలేక గత జూలైలో వాటర్ సర్వీసింగ్ మూసివేశాడు. ఈ నెల 2వ తేదీన షాపు తెరిచేందుకు వెళ్లగా తాళం విరగ్గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా మూడు వస్తువులు కనిపించలేదు. దీంతో అతను భీమిలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

➠ మరో కేసులో కొమ్మాది ప్రాంతానికి చెందిన గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న నార్ల కీర్తి చంద్ర వర ప్రసాద్ ఈ నెల 6వ తేదీన ప్రభుత్వ స్థలంలో వ్యర్థ పదార్థాల నిర్వహణ నిమిత్తం షెడ్ పై కప్పు నిర్మాణం నిమిత్తం 40 జీఈ షీట్స్ ఉంచ గా వాటిని దొంగలు దొంగిలించుకుపోయినట్లు ఫిర్యాదు చేశాడు.

➠ ఆనందపురం మండలం, వేములవలస ప్రాంతానికి చెందిన పడాల లావణ్య సాయిబాబు అదే ప్రాంతంలో ఎలక్ట్రికల్ షాప్ నిర్వహిస్తున్నాడు. అతని తండ్రికి ఆరోగ్యం బాలేక ఈ ఏడాది ఆగస్టు 16వ తేదీ నుంచి షాపు తెరవడం లేదు. ఈ నెల 11వ తేదీన షాపు తెరిచేందుకు వెళ్లగా షట్టర్ తెరిచి ఉంది. లోపల చూడగా సుమారు లక్ష రూపాయల సొత్తు దొంగతనానికి గురైనట్లు గుర్తించాడు. దీంతో ఆయన భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేపట్టి నిందితులు భీమిలి మండలం నమ్మివారి పేటకు చెందిన గొంప శ్రీను, తాళ్లవలసకు చెందిన వేచలాపు రామసత్యం, తాళ్లవలస, యాతపేటకు చెందివన కాకర సతీష్ అలియాస్ కల్తీ, వలందపేటకు చెందిన శరగడ అప్పలరాజు, నమ్మివారిపేటకు చెందిన అక్కరమాని ప్రసాద్‌లుగా గుర్తించి, చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.

➠ సీసీ కెమెరా రికార్డింగ్స్ ద్వారా నగర శాంతిభద్రతల డీసీపీ కె.శ్రీనివాసరావు, సీసీఎస్ ఏసీపీ ఏ వెంకటరావు, ఈస్ట్ క్రైం సీఐ వి.చక్రధరరావు, నార్త్ క్రైం ఎస్.ఐ కే సురేష్, టీమ్స్‌గా ఏర్పడి నిందితులను పట్టుకుని, అరెస్ట్ చేసి.. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

మహిళా కళాశాలకు అవార్డుల పంట


ఆర్‌జేడీ హోదాలో గౌరవ పురస్కారం అందుకుంటున్న ప్రిన్సిపాల్ శోభారాణి

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రాష్ట్ర స్థాయిలో 8 అవార్డులు కైవసం చేసుకుంది. అనంతపురంలో ఈ నెల 16న నిర్వహించిన ప్రజ్ఞ యాన్యువల్ ఫెస్ట్–2023లో కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ సాధించి అవార్డులు సొంతం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శోభారాణి తెలిపారు. విద్యార్థుల కేటగిరీలో పి.అనూష (బీఎస్సీ) మొదటి స్థానం, కె.పవిత్ర (బీఏ) మూడో స్థానం, ఉత్తమ కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులో ఆర్ నవ్యశ్రీ (బి.కాం) అవార్డు సాధించగా, రాష్ట్ర స్థాయిలో సీజీపీఏ 3.28 నేక్ ఏ+ గ్రేడ్ సాధించినందుకు కళాశాల ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి.అరుణపద్మను అవార్డుతో సత్కరించారు. అనంతరం ఇంటర్న్‌షిప్ విభాగంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి, ఇంటర్న్‌షిప్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.హైమావతికి అవార్డులు బహూకరించారు. రాష్ట్రంలో అనుబంధ కళాశాల్లో అత్యధిక అవార్డులు సాధించినందుకు గాను ఆర్‌జేడీ హోదాలో డాక్టర్ ఎస్ శోభారాణిని గౌరవ పురస్కారంతో ప్రత్యేకంగా సత్కరించారు.

'జగనన్నకు చెబుదాం'కు 194 అర్జీలు

మహారాణిపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం (జేకేసీ)లో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కారం చూపాలన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. మొత్తం 194 వినతులు రాగా వాటిలో 89 రెవెన్యూశాఖకు, 13 పోలీసుశాఖ, 47 జీవీఎంసీ, 45 ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. ఈ సందర్భంగాగా జేసీ పెండింగ్ అర్జీలపై జేసీ ఆరా తీశారు. కార్యక్రమంలో ఏసీపీ బాపూజీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హూస్సెన్ సాహెబ్, జీవీఎంసీ, ఇతర శాఖలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మందుల పేరుతో వచ్చి..పుస్తెల తాడు అపహరణ

మల్కాపురం: నమస్తే మేడం.. డాక్టర్ గారూ మందుల కోసం ఇంటికి రమ్మన్నారు..అని నమ్మించిన ఓ వ్యక్తి సదరు డాక్టర్ భార్య మెడలో బంగారు పుస్తెల తాడు అపహరించుకుపోయాడు. షాక్‌కు గురైన ఆమె కేకలు వేయగా అప్పటికే దొంగ పరారయ్యాడు. మల్కాపురం క్రైమ్ ఎస్.ఐ పల్లా శంకర్‌యాదవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 60వ వార్డులో పరిధిలోని గుల్లలపాలెం వుడా కాలనీ వద్ద కేవీఎల్ నర్సింగరావు అనే వైద్యుడు భార్య జానకితో కలిసి ఉంటున్నాడు. ఇంటికి సమీపంలో నర్సింగ్ హోం ఆస్పత్రి పెట్టి వైద్య సేవలందిస్తున్నాడు. సోమవారం సాయంత్రం నర్సింగరావు క్లినిక్‌కు వెళ్లిపోయాడు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తి..వైద్యుడు ఉంటున్న ఇంటికి వచ్చి తలుపు కొట్టాడు. డాక్టర్ భార్య జానకి తలుపు తీసి ఎవరు మీరు అని ప్రశ్నించగా...డాక్టర్ గారు తనను ఇంటికి రమ్మన్నారని, ఉదయం ఆస్పత్రికి వెళ్తే మందులు కొన్ని ఇచ్చారని, మరి కొన్ని ఇంటి వద్ద ఉన్నాయి.. సాయంత్రం వచ్చి తీసుకోమన్నారని నమ్మబలికాడు. డాక్టర్‌గారు క్లినిక్‌లో ఉన్నారు.. అక్కడకు వెళ్లండి అని జానకి బదులిచ్చింది. మాట్లాడుతూనే ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెలతాడు తెంపి పారిపోయాడు. ఆమె తేరుకుని కేకలు వేసేసరికే దొంగ పారిపోయాడు. క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటన స్థలానికి వచ్చి బాధితురాలు నుంచి వివరాలను సేకరించారు. దొంగ ఆనవాలను తెలుసుకున్నారు. అక్కడ సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శంకర్‌యాదవ్ తెలిపారు.

గుప్తనిధుల కోసం గొయ్యి!

- కంచరపాలెంలో కలకలం


గొయ్యిని పరిశీలిస్తున్న పోలీసులు

మద్రిపాలెం: ఓ వ్యక్తి తన ఇంటి వద్ద గుప్తనిధులు ఉన్నాయని 20 అడుగుల గొయ్యి తవ్వినట్టు కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచరపాలెం ధర్మానగర్ రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న కోటేశ్వరరావు అనే వ్యక్తి రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు. నెల రోజుల నుంచి అతని ఇంటి ముందు తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విజయవాడకు చెందిన పలువురు వచ్చి గుప్తనిధుల కోసమే ఈ గొయ్యి తవ్వుతున్నారని వివరించారు. విషయం బయటకు పొక్కడంతో గేట్లకు తాళాలు వేశారని పేర్కొన్నారు. కంచరపాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేశారు. వాస్తు బాగోలేక ఈ తవ్వకాలు చేపట్టినట్లు కోటేశ్వరరావు చెప్పాడు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

నిర్ణీత సమయంలో సమస్యల పరిష్కారం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ డాక్టర్ శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్)కు 104 వినతులు అందాయి. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జోన్-1 నుంచి రెండు, జోన్-2 నుంచి 20, జోన్-3 నుంచి 30, జోన్-4 నుంచి 10, జోన్-5 నుంచి 17, జోన్-6 నుంచి 7, జోన్-8 నుంచి 7, ప్రధాన కార్యాలయానికి 11 ఫిర్యాదులు అందాయి. నిర్ణీత సమయంలో వినతులను పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారని విభాగధిపతులకు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టీకల్చర్ ఎం.దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యదర్శి పి.నల్లనయ్య, ఎఫ్ ఏ అండ్ ఏఓ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజినీర్లు కృష్ణారావు, వేణుగోపాల్, డీపీవో చంద్రిక, ఏఎంవో డాక్టర్ కిషోర్, బయాలజిస్ట్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ జిల్లా మహిళా కార్యదర్శిగా రామలక్ష్మి



విశాఖ విద్య: ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా మహిళా కార్యదర్శిగా అనపర్తి రామలక్ష్మి నియమితులయ్యారు. అక్కయ్యపాలెం హైస్కూల్లో గణితం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రామలక్ష్మిని జిల్లా కమిటీ ప్రతిపాదనల మేరకు రాష్ట్ర కమిటీ ప్రకటించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రామలక్ష్మికి సంఘం సభ్యులు పలువురు అభినందనలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ నిర్వహణ పద్ధతులు పారదర్శకం

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వహణ పద్ధతులు పూర్తిగా పారదర్శకం, నైతికమైనవని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తెలిపింది. కార్మిక సంఘాల ఆరోపణల నేపథ్యంలో సోమవారం యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. స్టీల్‌ప్లాంట్ బలమైన, పారదర్శకమైన కొనుగోలు విధానం, నాణ్యత నియంత్రణ వ్యవస్థ కలిగి ఉందని తెలిపింది. ఉత్పత్తుల తయారీ ప్రక్రియలో కఠినమైన నాణ్యత తనిఖీల కారణంగా దేశీయ, ఎగుమతి మార్కెట్ రెండింటిలో స్టీల్ ప్లాంట్ ఉత్పత్తులు అత్యధిక నాణ్యతకు ప్రసిద్ధి చెందాయని పేర్కొంది. స్టీల్‌ప్లాంట్ టర్న్ అరౌండ్ సాధించడానికి, నగదు లాభాలు పొందడానికి, ఉత్పత్తి సామర్థ్యం సాధించడం అత్యవసరమని తెలిపింది. ఇందుకు సంబంధించి వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేయడమే కాకుండా ఉక్కు అధికారులు, కార్మిక సంఘాలతో చర్చించినట్లు స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ఈనెల 30న బీఎఫ్–3ను ప్రారంభించాలనే ప్రణాళికతో సంస్థ ముందుకు సాగుతుందని సంస్థ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ప్రతినిధి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా దాడి రమేష్

విశాఖ సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా దాడి రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు పేర్కొంది.

కిక్ బాక్సింగ్ పోటీల విజేత విశాఖ జట్టు



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : న్యూ కిక్ బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహించిన 13వ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో విశాఖ జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. రెండో స్థానాన్ని అనకాపల్లి జట్టు, మూడో స్థానాన్ని కాకినాడ జట్టు సొంతం చేసుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి విజేతలకు ట్రోఫీ, బహుమతులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతిరోజు క్రీడలను సాధన చేసేవారు మంచి ఆరోగ్యాన్ని కూడా సొంతం చేసుకుంటారన్నారు. కిక్‌బాక్సింగ్ సంఘం గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు వచ్చేనెలలో ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, వైఎస్సార్ సీపీ నాయకుడు సిరట్ల శ్రీనివాస్, ఎస్ఐ రవికుమార్, కోచ్‌లు టెంకి దుర్గ, ప్రేమ్, కృష్ణారావు, రమేష్, సతీష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 75 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న డీసీపీ లక్ష్మీనారాయణ

విశాఖ సిటీ: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని డీసీపీ బి.లక్ష్మీనారాయణ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 75 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

'కిరణ్ కృష్ణ'పై పోలీస్ స్పందనలో ఫిర్యాదు

విశాఖ సిటీ: కిరణ్‌కృష్ణ రియల్ ఎస్టేట్ సంస్థపై పోలీసులకు మరో ఫిర్యాదు అందింది. తనకు విక్రయించిన స్థలాన్ని వేరొకరికి కూడా రిజిస్ట్రేషన్ చేశారని గాజువాక చెందిన డేవిడ్ జయరాజు అనే వ్యక్తి సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పోలీస్ స్పందనలో ఫిర్యాదు చేశాడు. ఆనందపురం మండలం గండిగుండం గ్రామంలో 300 చదరపు గజాల స్థలాన్ని 1995లో కిరణ్‌కృష్ణ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి కొనుగోలు చేయగా.. ఆ ప్లాట్‌ను 2011లో వేరొకరికి తిరిగి విక్రయించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకొని గత మూడేళ్లుగా సంస్థ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్‌ను సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. అతడిపై చట్టపరంగా చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆ ఫిర్యాదులో కోరారు.

ఫిర్యాదులో వాస్తవం లేదు..

కిరణ్‌కృష్ణ రియల్ ఎస్టేట్ సంస్థపై వస్తున్న ఫిర్యాదుల్లో వాస్తవం లేదని సంస్థ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే చేసిన ఫిర్యాదులపై పోలీసులు విచారణ జరిపి అందులో ఎటువంటి వాస్తవాలు లేవని ఆ కేసులను మూసినట్లు వివరించారు. తమ సంస్థపై ఏ జిల్లాలోను, ఏ స్టేషన్‌లోను ఏ విధమైన కేసులు లేవని స్పష్టం చేశారు.

జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనబోయే జట్టు

అగనంపూడి: విశాఖ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. లంకెలపాలెం జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా గెంజి కనకారావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.రాజు, కోశాధికారిగా కేఎం నాయుడు, ఉపాధ్యక్షులుగా రౌతు నాగేశ్వరావు, మోటూరి వెంకట నాగేశ్వరరావు, దాడి బాలకృష్ణ, మల్ల మహాలక్ష్మినాయుడు, సంయుక్త కార్యదర్శిగా కె.నారాయణమ్మ, ఎ.రెహమాన్, ఎ.నాగరాజు, సభ్యులుగా జి.మణికంఠ, వరప్రసాద్, ఎస్.పల్లవి, శ్వేతాశ్రీ, ఎ.సతీష్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరిశీలకులుగా ది ఒలింపిక్ అసోసియేషన్ విశాఖ ప్రతినిధి సీహెచ్.నాగేశ్వరరావు వ్యవహరించారు.అనంతరం జిల్లా తరుపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారులను ఎంపిక చేశారు. మహిళల జట్టుకు ఎస్.పల్లవి శ్వేతా, టి.బంగారమ్మ, కె.దుర్గామయి, బి.గ్రీష్మ, జి.స్వాతిలను ఎంపిక చేశారు. పురుషుల విభాగం నుంచి టీవీకే అప్పారావు, ఆర్.గురుచరణ్, అశ్లేష కుమార్, జి.రాకేష్ భార్గవ, పి.ఉదయ్‌కిరణ్‌లను ఎంపిక చేశారు.